సాక్షి
నిజామాబాద్
సోమవారం : 22 : జనవరి : 2024



ఇదేమి నీటి విడుదల..!
శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదలపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- 8లో ▸



సంఘటితమైతే శక్తి చాటాలి..
మున్నూరు కాపులంతా సంఘటితమై తమ శక్తిని చాటాలని బీఎంకేఉద్యమ్యా గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.3 /21.1
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం చల్లటి గాలులు వీస్తాయి. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

బాలరాముడి ప్రాణప్రతిష్ఠకు హాజరవ్వడం అదృష్టం

సుభాష్‌నగర్ : అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుండి బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానం అందిందని, దీనిని తన అదృష్టంగా భావిస్తున్నానని ఎంపీ అర్వింద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి ఆహ్వానం మేరకు అయోధ్య చేరుకున్నానని ఆయన తెలిపారు.

క్యాంపస్‌లో ప్రత్యక్షప్రసారం

తెయూ(డిచ్‌పల్లి) : శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అయోధ్యలో జరగబోయే బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని తెలంగాణ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో లైవ్ స్క్రీనింగ్ చేయనున్నారు. ఉదయం 11.30 గంటలకు వర్సిటీ ప్రాంగణంలోని హనుమాన్ ఆలయంలో శ్రీసీతారామస్వామి వారికి ప్రత్యేక పూజలు అనంతరం తీర్థప్రసాదాలు అందజేయనున్నారు.

జిల్లాలో ట్రాఫిక్ ఆంక్షలు

ఆలయాల వద్ద భద్రత: సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి : అయోధ్యలోని రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న దృష్ట్యా జిల్లావ్యాప్తంగా ఆలయాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని, ట్రాఫిక్ ఆంక్షలు కూడా ఉంటాయని సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 వరకు నిజామాబాద్ డివిజన్ హైమదీబజార్‌లోని శంభుని గుడి, వీక్లీ మార్కెట్ లోని గోల్ హనుమాన్, ఖిల్లా రఘునాథ్ ఆలయం వద్ద, ఆర్మూర్ డివిజన్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయం, రాంనగర్ రామాలయం మందిరం, బోధన్ డివిజన్‌లోని రామాలయం బోధన్, మారుతి మందిర్, రాకాసిపేట్ హనుమాన్ ఆలయం, ఏకచక్రేశ్వర స్వామి ఆలయం వద్ద వాహనాల డైవర్షన్ ఉంటుందన్నారు.

త్వరలో జూ. లైన్‌మెన్ పోస్టుల నాలుగో విడత జాబితా

నిజామాబాద్ నాగారం : విద్యుత్ శాఖ పరిధిలో గతంలో నిర్వహించిన జూనియర్ లైన్‌మెన్ పోస్టులకు సంబంధించి నాలుగో విడత జాబితాను విడుదల చేయనున్నారు. ఇందుకు సంబంధించిన జీవోను విద్యుత్ శాఖ ఎస్‌ఈ రవీందర్‌కు సీఎండీ కార్యాలయం నుంచి మెయిల్ ద్వారా పంపారు. 2018 ముందు జేఎల్‌ఎంల రిక్రూట్‌మెంట్ సంబంధించి మొదటి మూడు విడతల్లో అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా స్తంభం పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగాలిచ్చారు. తాజాగా నాలుగో విడత జాబితాను విడుదల చేయనున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో నిరుద్యోగ జేఎల్‌ఎం పరీక్ష రాసిన అభ్యర్థుల లిస్ట్‌ను మెరిట్ ఆధారంగా సిద్ధం చేస్తారు. దీనికి సంబంధించి మార్గదర్శకాలు 29న వెలువడినట్లు తెలిసింది.

ముగిసిన ప్రత్యేక ఓటరు నమోదు



సుభాష్‌నగర్ : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం చేపట్టిన రెండ్రోజుల ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. జిల్లాలోని 1,549 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉండి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 4,021దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఫారం- 6 దరఖాస్తులు 2,754, ఫారం-7 దరఖాస్తులు 167, ఫారం-8 దరఖాస్తులు 1100 ఉన్నాయి. రిటర్నింగ్, సహాయరిటర్నింగ్ అధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఇప్పటికే ముసాయిదా జాబితా విడుదల చేసిన విషయం తెలిసిందే. జనవరి 22వ వరకూ ఓటరు నమోదుతో పాటు తొలగింపు, మార్పులు, చేర్పులకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా విడుదల చేస్తారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో సంకీర్తనలు



నిజామాబాద్ సిటీ: అయోధ్యలో భవ్య రామ మందిరంలో రాముడి ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న శుభ సందర్భంగా ఆదివారం రాత్రి ఇస్కాన్ ఇందూరు ఆధ్వర్యంలో నగర సంకీర్తన రామ భక్తి కార్యక్రమం నిర్వహించారు. ఇస్కాన్ ఇందూరు జిల్లా అధ్యక్షుడు రామానంద ప్రభు మాట్లాడుతూ అయోధ్యలో భవ్య మందిర నిర్మాణం జరుగుతున్న దృష్ట్యా ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు.



రాములోరి వేడుకకు వేళాయే..

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠకు సర్వం సిద్ధమైంది. శతాబ్దాల పోరాటం విజయవంతమై, శ్రీరాముడి కోసం కన్న కలలు సాకారమయ్యే ఘడియలు సమీపించాయి. నేడు జరిగే క్రతువుకు అయోధ్య సర్వాంగసుందరంగా ముస్తాబైంది. జిల్లాలోనూ రామాంజనేయ ఆలయాలను అందంగా అలంకరించారు. అన్నదానాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దశాబ్దాల క్రితం అయోధ్యలో కరసేవకు వెళ్లిన జిల్లావాసులు తమ మనోగతాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు. అవి వారి మాటల్లోనే..- నిజామాబాద్ సిటీ

- జిల్లాలో ముస్తాబైన రామాంజనేయాలయాలు
- భారీ అన్నదానాలకు ఏర్పాట్లు
- అయోధ్య ఘట్టం ప్రత్యక్ష ప్రసారానికి భారీ స్క్రీన్లు సిద్ధం





వేడుకకు సిద్ధమైన డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం, ఇన్‌సెట్‌లో సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తులు

కరసేవతో జీవితం ధన్యం



1990లో హైదరాబాద్‌లో రైలెక్కి కాశీకి చేరుకున్నాం. అయోధ్యకు వెళ్లే అవకాశం లేకపోవటంతో కాశీలో స్థానికులు ఆదుకున్నారు. తాము అక్కడ సత్యాగ్రహం చేయగా పోలీసులు అరెస్టు చేసి కాజీపూర్‌లో డిగ్రీ కాలేజీలో 15రోజులుంచి వదిలేశారు. తిరిగి 1992లో డిసెంబర్ 6న జరిగిన కరసేవలో బాలరాముడి విగ్రహాన్ని దర్శించుకున్నాం. కరసేవతో నా జీవితం ధన్యమైంది.

– మంద నర్సింలు, పెద్దబజార్

ఆంక్షలున్నా అయోధ్య వెళ్లాం..



అయోధ్యలో కరసేవలో పాల్గొనేందుకు కమ్మర్‌పల్లి నుంచి వీహెచ్‌పీ విభాగ్ సంఘటన కార్యదర్శి వైట్ల సుబ్బారావు ఆధ్వర్యంలో 42 మంది సభ్యులతో అయోధ్యకు బయలుదేరాం. కాని అప్పటి ములాయం సింగ్ ప్రభుత్వం ఎన్నో ఆంక్షలు విధించింది. రైలు వారణాసి వెళ్లకుండా మధ్యలోనే నిలిపివేయించారు. స్థానికంగా ఓ మందిరంలో ఆశ్రయం పొందాం. అక్కడి నుంచి అయోధ్యకు వెళ్తుండగా పోలీసులు అరెస్ట్ చేసి ఒక ఫ్యాక్టరీలో ఐదురోజులు బంధించారు. అనంతరం కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే బస్సులు పెట్టి సెంట్రల్‌జైలుకు పంపారు. నాలుగురోజుల తర్వాత మమ్మల్ని హైదరాబాద్ పంపేందుకు మొగల్‌ఫరాయి రైల్వేస్టేషన్‌కు పంపగా తప్పించుకుని ఫైజాబాద్ రైలెక్కి అయోధ్య వెళ్లాం. బాలరాముడిని దర్శించుకున్నాం. కాని అప్పటికే అయోధ్యలో విధ్వంసం జరిగింది. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. యూపీ ప్రజలు తమ బంధువుల్లా మమ్మల్ని చూసుకున్నారు.

– శ్రీరాముల సుదర్శన్, నందిపేట్

500ఏళ్ల కల సాకారమవుతున్న వేళ..



1990లో వీహెచ్‌పీ విభాగ్ సంఘటన కార్యదర్శి పనిచేస్తున్నా. 470 మంది కరసేవకులను అయోధ్యకు పంపగా, తాను 101 మందికి ఇన్‌చార్జిగా ఉన్నాను. అయోధ్యకు రైలులో వెళ్తుంటే మమ్మల్ని ఇటార్సీ అడవుల్లో దించేశారు. అక్కడి నుంచి యూపీ సరిహద్దుకు చేరుకుని కాశీకి వెళ్లాం. తమను అయోధ్య పంపాలని కాశీలో ధర్నా చేస్తే అరెస్ట్ చేసి 15రోజులు జైల్లో పెట్టారు. అక్కడి నుంచి వెనక్కివెళ్లాలని కాశీ రైల్వేస్టేషన్‌కు పంపారు. కాని అయోధ్యకు వెళ్తామంటే టిక్కెట్లు ఇవ్వకపోవడంతో వేరే రైల్లో టిక్కెట్లు లేకుండానే అయోధ్య చేరాం. అక్కడ అప్పటికే సరయు నదిలో రక్తప్రవాహం కనిపించింది. ఎంతోమందిని చంపేశారు. ప్రస్తుతం బాలరాముడి ప్రతిష్ఠతో ఏళ్ల కల సాకారమవుతోంది.

– వైట్ల సుబ్బారావు, వీహెచ్‌పీ సంఘటన కార్యదర్శి

అడుగడుగునా అడ్డంకులే..



1990లో మొదటి కరసేవకు 100 మంది బృందంతో వెళ్లాం. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి స్పెషల్‌గా వేసిన బోగిలో రెండురోజులు ప్రయాణం చేశాను. యూపీలో ప్రతిస్టేషన్‌లో బోగీలను పోలీసులు తనిఖీ చేశారు. తాము పోలీసులకు దొరక్కుండా రాంపూర్ గ్రామంలో ప్రముఖులతో కలిసి రైలు దిగి ప్రయాగ వరకు 40 కి.మీ పాదయాత్ర, బండ్లపై చేరుకున్నాం. అక్కడ వంతనపై మిలటరీ ఫోర్స్ రావటంతో తమ బృందంలోని మహిళలు వారి కళ్లల్లో కారం చల్లటంతో తమపై వారు విచక్షణారహితంగా లాఠీచార్జీ చేసి అరెస్టు చేసి బాదాయి జిల్లాలో గురుకుల పాఠశాలలో 11రోజుల పాటు ఉంచారు. భోజనానికి ఎంతో ఇబ్బంది పడ్డాం. అనంతరం పోలీసులకు తాము వెనక్కి వెళ్తామని చెప్పటంతో వదిలేశారు. కానీ తామంతా అయోధ్యకు వెళ్లిబాలరాముడును దర్శించుకుని వచ్చాం.

– బైరి గంగాధర్, ఉద్యోగి



విద్యుత్ కాంతుల మధ్య నగరంలోని ఖిల్లా రామాలయం

ప్రతి ఇంట్లో పండుగే..



సుభాష్‌నగర్: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా జిల్లాలోని ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి దీపావళి పండుగ జరుపుకోవాలి. సాయంత్రం 5 దీపాలు వెలిగించాలి. ఉదయం మామిడి తోరణాలతో ఇంటిని అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించాలి. 500 ఏళ్ల తర్వాత భవ్య రామమందిరాన్ని నిర్మించుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– దినేశ్ ఠాకూర్, జిల్లా అధ్యక్షుడు విశ్వహిందూ పరిషత్

దీపావళి లాగా జరుపుకోవాలి..



సుభాష్‌నగర్ : అయోధ్యలో భవ్యమైన రామమందిరం నిర్మాణంతో 500 ఏళ్ల నాటి కల సాకారమౌతోంది. బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని జిల్లాలోని హిందువులందరూ దీపావళి పండుగ వలే జరుపుకోవాలి. హిందువుల ఐక్యమత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

– గాజుల దయానంద్, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జిల్లా సహ సంయోజక్

రెండుసార్లు కరసేవలో పాల్గొన్నా..



1990లో అయోధ్యకు వెళ్తూ ఇరానిగంజ్ రైల్వే స్టేషన్‌లో రైలు నిలిపివేయగా అక్కడి నుంచి అడవిలో నడుచుకుంటూ స్థానికుల సహకారంతో కాశీకి చేరుకున్నాం. కాశీ నుంచి అయోధ్యకు 500 మంది ర్యాలీగా వెళ్తుంటే అరెస్టు చేసి గాజీపూర్‌లో డిగ్రీ కాలేజీలో 18 రోజులు ఉంచారు. బీజేపీ, వీహెచ్‌పీ భోజనాలు ఏర్పాటు చేశారు. నవంబర్ 30న కరసేవకులపై ఫైరింగ్ చేసినా అయోధ్యకు చేరుకున్నాం. రెండోసారి 1992 డిసెంబర్ 4న అయోధ్యకు వెళ్లాం.

– కంతపు శ్యాంసుందర్, ప్రైవేట్ ఉద్యోగి

స్థానికులు ఆదుకున్నారు..



1992 డిసెంబర్ 3న అయోధ్యకు చేరుకున్నాం. స్థానికులే అన్ని వసతులు కల్పించారు. డిసెంబర్ 6న కరసేవలో పాల్గొన్నా. ఎన్నోఏళ్లుగా శ్రీ రాముడి ఆలయం నిర్మాణం జరగాలని కోరుకుంటూ వచ్చా. అప్పట్లో ప్రతి రైల్వేస్టేషన్‌లో స్థానికులే తమకు భోజనాలు, అల్పాహారం ఇచ్చారు. అనంతరం కరసేవలో పాల్గొన్నాను. అనంతరం దేశమంతా కర్ఫ్యూ విధించినప్పటికీ ఇబ్బంది పడకుండా ఇంటికి చేరుకున్నాం.

– సంజీవ్, సంజీవ్‌నగర్ కాలనీ

సేవలో కాలు విరిగింది..



1992 నవంబర్ 16న 70 మందితో జిల్లా నుంచి అయోధ్యకు బయలుదేరాం. స్థానికుల సహకారంతో అలహాబాద్‌లో 3 రోజుల పాటు త్రివేణి సంగమం వద్ద టెంట్‌లు వేసుకుని ఉండిపోయాం. అనంతరం డిసెంబర్ 6న అయోధ్యకు చేరుకుని లక్షమందితో ర్యాలీ నిర్వహించాం. కరీంనగర్, నిజామాబాద్‌కు చెందిన వారే మొదటి వరుసలో ఉన్నాం. రామజన్మభూమి విముక్తి ఉద్యమంలో నా కాలు విరిగింది.

– ప్రకాశ్ గౌడ్, నాందేవ్‌వాడ





ఖిల్లా రామాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నగరంలోని రైల్వే స్టేషన్‌ను విద్యుద్దీపాలతో అలంకరించిన దృశ్యం



రామలక్ష్మణ వేషధారణలో రామకృష్ణ విద్యానికేతన్ చిన్నారులు

ధరణి దారికొచ్చేనా..?

- ఏళ్లుగా పరిష్కారం కాని భూసమస్యలు
- పోర్టల్‌లో మార్పులు.. లేదా ప్రత్యామ్నాయం చూస్తామన్న సర్కారు
- అధ్యయనానికి కమిటీ ఏర్పాటు



మోర్తాడ్(బాల్కొండ) : ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన కొట్టె నారాయణకు సర్వే నం. 242లో 13.5 గుంటల భూమి ఉంది. 326 అబీ సర్వే నంబర్‌లో 7 గుంటలకు పైగా భూమి ఉంది. దీనికి సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన పట్టాదారు పాసు పుస్తకం, టైటిల్ డీడ్‌లు నారాయణ వద్ద ఉన్నాయి. అలాగే 2016 వరకు రాసి ఉంచిన మాన్యువల్ పహాణిలలోను కొట్టె నారాయణ పేరు మీద భూమి వివరాలు నమోదు చేసి ఉన్నాయి. 2018లో కొత్తగా డిజిటల్ పాస్‌పుస్తకాలను తెలంగాణ ప్రభుత్వం ఇవ్వగా అందులో నారాయణ పేరు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో పాస్‌పుస్తకం రాలేదు. ఆన్‌లైన్‌లో తనిఖీ చేస్తే కొట్టె నారాయణ పేరు మీద ఉన్న భూమి ఇతరుల పేరుపై నమోదై ఉంది. 2017లో అన్ని భూముల విస్తీర్ణం, సర్వే నంబర్లు, యజమానుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయగా నారాయణ వివరాలను సరిగా నమోదు చేయలేదు. నారాయణకు సంబంధించిన భూమిలో అతని కుటుంబ సభ్యులే వ్యవసాయం చేస్తున్నా రెవెన్యూ రికార్డులలో మాత్రం తప్పుడు వివరాలు నమోదు చేసి ఉన్నాయి. ఫలితంగా ఇంత వరకు నారాయణకు రైతుబంధు మంజూరు కాలేదు. ఇలా జిల్లాలో అనేకమంది రైతుల సమస్యలు ఏళ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయి.

భూ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడానికి ధరణి వెబ్‌పోర్టల్‌లో మార్పులు చేయడమా లేక పోర్టల్‌కు ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేయడంపై దృష్టి సారిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా ఇంకా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2019లో రెవెన్యూ సంస్కరణలు చేపట్టి ధరణి వెబ్‌పోర్టల్ ద్వారానే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లను చేపట్టింది. 2018కి ముందు ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్‌డీడ్ రైతుల వద్ద ఉన్నాయి. వీటిస్థానంలో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం డిజిటల్ పాస్‌పుస్తకాలను జారీ చేసింది.

ఐదు వేలకు పైగానే..

ఒకరి పేరున ఉన్న పట్టా మరొకరి పేరు మీద నమోదవ్వడం, సర్వే నంబర్ల జంపింగ్, భూ విస్తీర్ణం తగ్గింపు, పట్టా భూమి అసైన్‌మెంట్ భూమిగా నమోదు కావడం, ఇలా ఎన్నో రకాల తప్పులు చోటు చేసుకోగా వీటిని సవరించాలని రైతులు అందించిన దరఖాస్తులు జిల్లాలో 5వేల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. తహసీల్దార్లు, ఆర్డీవోల స్థాయిలో తప్పులను సవరించే ఆప్షన్ లేకపోవడం, అన్ని కలెక్టర్ కార్యాలయం ద్వారానే సవరించాల్సి ఉండటంతో సమస్యలు పరిష్కారం కావడం లేదు.

పోర్టల్‌లో కబ్జాకాలం తొలగింపుతో..

కొత్త రెవెన్యూ చట్టం అమలు కాక ముందు పహాణిలలో పట్టాదారు కాలంతో పాటు కబ్జా కాలం ఉండేది. ఎవరైనా భూమిని కొనుగోలు చేసుకుని సాగు చేసుకుంటే పట్టా మార్పిడి జరుగకపోయినా కబ్జా కాలంలో సంబంధిత రైతు పేరును నమోదు చేసేవారు. కొత్త రెవెన్యూ చట్టం అమలు ద్వారా కబ్జా కాలంను ప్రభుత్వం తొలగించింది. క్షేత్ర స్థాయిలో ఉన్న భూమిని సదరు రైతు కబ్జాలో ఉన్నా ఆ కాలమ్ లేకపోవడంతో రెవెన్యూ రికార్డులలో పట్టాదారులదే పైచేయిగా మారింది. పట్టాదారు ఒక్కరి పేరు రికార్డులలో ఉండేసరికి వారు భూమి విక్రయించినా పట్టా మార్పిడి జరుగకపోవడంతో చిన్న సన్నకారు రైతులకు ముప్పు వాటిల్లేలా తయారైంది.

“దరఖాస్తులను పరిశీలించాలి



ధరణి అమలులోకి వచ్చిన తరువాత అనేక భూముల సమస్యలు పరిష్కారంకు నోచుకోలేవు. కొత్త ఆప్షన్‌లు ఇచ్చి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అధికారులు తొందరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం సత్వరమే చర్యలు చేపట్టాలి.

– గడ్డం లింగారెడ్డి, రైతు నాయకుడు, గుమ్మిర్యాల్

వేగంగా పరిష్కరించాలి



చిన్న సన్నకారు రైతుల సమస్యలను వేగంగా పరిష్కరించాలి. తమ భూముల్లో రైతులు సాగు చేసుకుంటున్నా పట్టాలు అందుకోలేక అవస్థలు పడుతున్నారు. బ్యాంకు రుణాలు, పెట్టుబడి సాయం, రైతుబీమాకు దూరమయ్యారు.

– కౌద లింబాద్రి, రైతు, తొర్తి

నేడు మద్యం, మాంసం బంద్

- అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో..
- గ్రామాల్లో తీర్మానాలు

మోర్తాడ్ : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం జిల్లాలోని పలు గ్రామాల్లో మాంసం, మద్యం విక్రయాలపై నియంత్రణ విధిస్తూ వీడీసీలు తీర్మానం చేశాయి. అలాగే ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేయడానికి సన్నాహాలు చేస్తున్నాయి. శతాబ్దాల కల అయోధ్య రామమందిరం సాకారం అవుతుండటంతో సోమవారం గ్రామాల్లో సంబురాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని నిర్ణయించారు. రాజకీయపార్టీలకు అతీతంగా ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం వీక్షించడానికి పెద్ద పెద్ద తెరలను సైతం ఏర్పాటు చేస్తున్నారు. ప్రాణ ప్రతిష్ఠ అనంతరం అన్నదానం నిర్వహించనున్నారు. భక్తులు అన్నదాన కార్యక్రమం కోసం విరాళాలు ఇస్తున్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే కార్యక్రమం కావడంతో మద్యం, మాంసం విక్రయాలపై నియంత్రణ అమలు చేయాలని నిర్ణయించారు. అధికారికంగా నిషేధం లేకపోవడంతో స్వీయ నియంత్రణకు గ్రామాభివృద్ధి కమిటీలు ముందుకు వచ్చాయి. వీడీసీల నిర్ణయాలను భక్తులు, ప్రజలు స్వాగతిస్తున్నారు.

షబ్బీర్ అలీకి దక్కిన పదవి

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖల సలహాదారుగా నియామకం
- మాజీ మంత్రి అనుచరుల్లో ఆనందం



సాక్షి, కామారెడ్డి: ఎట్టకేలకు మాజీ మంత్రి షబ్బీర్ అలీ సీనియారిటీకి గుర్తింపు దక్కింది. ఆయనను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖల సలహాదారుగా నియమిస్తూ సర్కారు నిర్ణయం తీసుకుంది.

రాష్ట్రంలో సుమారు దశాబ్దకాలం తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే మాజీ మంత్రి, పీఏసీ చైర్మన్ షబ్బీర్ అలీ మొన్నటి ఎన్నికల్లో ఓటమి చెందడంతో కొంత నిరాశచెందారు. ఎమ్మెల్యేగా గెలుపొంది ఉంటే ప్రభుత్వంలో కీలకమైన పదవి దక్కేదని భావించారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా గుర్తింపు ఉన్న షబ్బీర్ అలీ.. మైనారిటీ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం, తద్వారా మంత్రి పదవి వస్తుందని ఆశించారు. కానీ ఆ అవకాశం దక్కలేదు. దీంతో ఆయన అనుచరులు నిరుత్సాహానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం మేరకు షబ్బీర్ అలీని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా (బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖలు) నియమిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఐదేళ్లుగా అధికార పదవి లేకుండా ఉన్న షబ్బీర్ అలీకి ఇప్పుడు ప్రభుత్వ సలహాదారు హోదా లభించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కాగా షబ్బీర్ అలీకి అధికారిక పదవి లభించడంతో కామారెడ్డి నియోజకవర్గంలో రాజకీయాలు మారనున్నాయి. స్థానికంగా అధికార పార్టీ ఆధిపత్యం కోసం ప్రయత్నించే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ నేతలు, శ్రేణులు యాక్టివ్ అయ్యారు. దీనికి తోడు షబ్బీర్‌కు సలహాదారు పదవి రావడంతో వారు మరింత క్రియాశీలకంగా వ్యవహరించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

క్లుప్తంగా

శోభాయాత్రను శాంతియుతంగా నిర్వహించాలి



నందిపేట్: అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే శోభాయాత్రను శాంతియుతంగా జరుపుకోవాలని ఏసీపీ జగదీశ్‌చందర్ శోభాయాత్ర నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా శోభాయాత్ర ఏర్పాట్లను ఎస్సై రాహుల్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. ముందుగా రాజానగర్‌లోని రామాలయం,ఆంజనేయ ఆలయంలో పూజలు చేశారు. శోభాయాత్రను భక్తులు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆరుట్ల రమేశ్,మాన్పూర్ భూమేశ్, శేఖర్‌రెడ్డి, భక్తులు, శోభాయాత్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

శాంతికమిటీ సమావేశం..



నందిపేట్: ప్రతి ఒక్కరూ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై రాహుల్ అన్నారు. మండల కేంద్రంలోని పీఎస్‌లో ఆదివారం నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం రాజనగర్ రామ మందిరం ఆధ్వర్యంలో శోభాయాత్ర చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు సర్వమతాల సభ్యులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. అన్ని మతాల పండుగలను ఒకరినొకరు గౌరవించుకోవాలని సూచించారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఆరుట్ల రమేశ్, శేఖర్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు హైమద్, యువకులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్సై



మహేందర్, ఎస్సై

రుద్రూర్:మండల ఎస్సైగా మహేందర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. బోధన్‌లో ఎస్సైగా ఉన్న ఆయన బదిలీపై రుద్రూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పండుగలను మతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి జరుపుకోవాలని కోరారు.


గంజాయి స్వాధీనం



బాన్సువాడ: పట్టణంలోని గొలిగూడలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు మండల కేంద్రానికి చెందిన షర్ఫొద్దీన్‌ను అదుపులోకి తీసుకొని 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయిని ఎక్కడి నుంచి తీసుకొచ్చాడో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఇదేమి నీటి విడుదల..!

- వరదకాలువ ద్వారా మళ్లీ విడుదల
- రెండు రోజుల క్రితం నిలిపివేత
- ఇది వరకు మూడుసార్లు విడుదల
- అధికారుల తీరుపై రైతుల అసహనం



వరద కాలువ ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద కాలువ ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల తీరుపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి ప్రస్తుత సంవత్సరం యాసంగి సీజన్‌లో అధికారులు ఆయకట్టుకు నీటివిడుదలను చేపడుతున్నారు. గతంలో ఎప్పుడూ యాసంగిలో వరద కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టలేదు. కానీ ప్రస్తుత సంవత్సరం నూతన ఆయకట్టులో భాగంగా నీటి విడుదల చేపడుతున్నారు. ఈ నెల 6వ తేదీ నీటిని విడుదల చేశారు. 2 వేల క్యూసెక్కులు వదిలారు.

ఈ నెల 11న నీటి విడుదలను నిలిపివేశారు. మళ్లీ రెండు రోజులు గడవక ముందే 13వ తేదీ నుంచి నీటిని విడుదల చేపట్టారు. ఈ సారి 3 వేల క్యూసెక్కులు వదిలారు. ఈ నెల 18 వరకు నిరంతరం నీటి విడుదల చేపట్టారు. 18న సాయంత్రం నిలిపేశారు. మళ్లీ రెండు రోజులు గడవక ముందే శనివారం ప్రారంభించారు. ఈ సారి వరద కాలువ ద్వారా 5వేల క్యూసెక్కులు వదులుతున్నారు. నీటి విడుదల ప్రారంభం నుంచి నిలిపేసిన ప్రతిసారి రెండు రోజులు గడవక ముందే నీటిని మళ్లీ విడుదల చేస్తున్నారు. అంతే కాకుండా వదిలిన ప్రతిసారి నీటి విడుదలను పెంచుతూ వస్తున్నారు. ఇలా ఇష్టారీతిన వరద కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టడంపై ఆయకటుట రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాల్వల ద్వారా యాసంగి పంటలకు నీటివిడుదల కొనసాగుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం వేగంగా తగ్గుతోంది. ప్రాజెక్టు నుంచి వరద కాలువ ద్వారా 5వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 3500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 476 క్యూసెక్కులు, ముంపు ఎత్తిపోతల ద్వారా 312 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 354 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(90 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1081.80 అడుగుల(57.05 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

మున్నూరుకాపులు సంఘటితం కావాలి

- టీఎంకేఈడబ్ల్యూఏ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఏనుగుల సత్యనారాయణ

నిజామాబాద్ నాగారం : మున్నూరుకాపు సభ్యులందరినీ సంఘటిత పరుచుకొని సంక్షేమ కార్యక్రమాలు ప్రగతి బాట నడిపించేందుకు అందరూ కృషి చేయాలని మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఏనుగుల సత్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని న్యాల్‌కల్ పట్టణ మున్నూరు కాపు సంఘం ఫంక్షన్‌హాల్‌లో మున్నూ రు కాపు ప్రభుత్వ ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని అనంతరం మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక స్థాయి లో సంఖ్యాబలం ఉన్నది మున్నూరుకాపులదేనన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ధర్మపురి సురేందర్ పటేల్ మాట్లాడుతూ అత్యధిక మున్నూరు కాపు కళ్యాణ మండపాలు నిజామాబాద్‌లోనే ఉండటం గర్వించదగ్గ విషయమన్నారు. ఇది మున్నూరు కాపుల ఐక్యతకు నిదర్శనమన్నారు. మరో గౌరవ అతిథి బాల శ్రీనివాస్ పటేల్ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ఉద్యోగుల సంఘానికి పునాది ఏర్పడ్డప్పటికి మధ్యలోనే నిలిచిపోయిందని, మూడేళ్ల క్రితం మళ్లీ అందరినీ ఒక్కతాటిపైకి తెచ్చి ప్రస్తుతం 33 జిల్లాల్లో ప్రతిష్టాత్మకంగా నిలిచామన్నారు. ప్రస్తుతం మన సంఘంలో దాదాపు 55,000 మంది సభ్యులున్నారన్నారు. ప్రతి జిల్లాలో సభ్యత్వ నమోదుకు కొనసాగించి రాష్ట్రంలోని అతిపెద్ద సంఘంగా నిలిచేందుకు కృషి చేద్దామన్నారు. రాజకీయాలకు అతీతంగా మన సంఘం పనిచేస్తోందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తోటరాజశేఖర్ మాట్లాడుతూ అనిత కాలంలోనే ఈ సంఘాన్ని ఒక తాటిపైకి తీసుకువచ్చి జిల్లాలో సభ్యులను ఒకే మాట పైన నడిపిస్తూ సారథ్యం వహించడం జరిగిందని దీనికి రాష్ట్ర సంఘం తమను సహకారాన్ని అందించిందన్నారు. భవిష్యత్తులో డివిజన్ స్థాయి లో కమిటీలు త్వరలోనే వేస్తామని, బీద విద్యార్థులకు చేయూతనిచ్చి, పెళ్లి పందిరిని ప్రారంభించి అందరికీ అందుబాటులో నిలుస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి అబ్బాపూర్ మాట్లాడుతూ జిల్లా నివేదికను సమర్పించారు. అందరూ సభ్యత్వం తీసుకొని సంఘాన్ని ప్రతిష్టపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసం శ్రీనివాస్ పటేల్ సంయుక్త కార్యదర్శి ఆర్మూర్ శ్రావణ్ కుమార్ పటేల్, జిల్లా గౌరవ అధ్యక్షుడు బీ.ఆంజనేయులు పటేల్, ముఖ్య సలహాదారుడు ఆకుల ప్రసాద్ పటేల్, సహ అధ్యక్షులు జిలకర కిషన్ పటేల్, పెద్దోళ్ల నాగరాజు సలహాదారులు నేటి కుంట శేఖర్ పటేల్ ,చిట్టి నారాయణ రెడ్డి పటేల్, సుమారు. 300 మంది సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్నూరు కాపు ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



బినోలాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట: విద్య, వైద్య, సాగునీటి రంగాలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని లింగాపూర్, నాళేశ్వర్, తుంగిని, నిజాంపూర్, బినోల, సిరన్‌పల్లి, జన్నెపల్లి, నారాయణ్‌పూర్ గ్రామాలలో ఆదివారం పర్యటించారు. బినోల శివారులో రూ. 70 లక్షల వ్యయంతో నిర్మించిన సొసైటీ భవనాన్ని ప్రారంభించి ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర ప్రభుత్వ భవన నిర్మాణాల పనులను తాత్కాలికంగా ఆపేసి, విద్యారంగ సదుపాయాలకు నిధులు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులను ఆదుకుంటున్న ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు అధికారులు కృషి చేయాలన్నారు. నాళేశ్వర్, యంచ ఎత్తిపోతల పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులతో పాటు సిబ్బంది పోస్టుల భర్తీకి త్వరలో చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో బెల్ట్‌షాపుల నిర్వహణపై ఎక్సైజ్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాహెర్, అంతిరెడ్డి రాజారెడ్డి, మానాల మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, చల్లా రవీందర్, భానుచందర్‌గౌడ్, పోశెట్టి, బాబు, మూస, విజయ్, పెద్దన్న, రాజేశ్వర్, బినోల సొసైటీ డైరెక్టర్లు, సీఈవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బోధన్‌టౌన్: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకతీయ చేయూత చారిటబుల్ ట్రస్ట్, కమ్మ సంఘం సహకారంతో 56వ సీనియర్ ఖోఖో చాంపియన్ షిప్ పోటీలను పట్టణ శివారులోని కమ్మ సంఘంలో ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను ఆర్డీవో రాజాగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. వచ్చే ఏడాది ఖోఖో పోటీలను పట్టణంలో నిర్వహిస్తామన్నారు. అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భూంరెడ్డి, కమ్మ సంఘం అధ్యక్షుడు శివన్నారాయణ, కాకతీయ చేయూత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జంట మరణాలపై విచారణ చేపట్టాలి

ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఎనిమిదేళ్ల క్రితం జరిగిన తలారి సత్యం, చేపూర్ రవి జంట మరణాలపై ప్రభుత్వం ఉన్నతస్థాయి దర్యాప్తు చేయించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని తాజ్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రాజకీయ పార్టీలు, దళిత ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో తలారి సత్యం యాదిలో ప్రజాస్వామిక స్ఫూర్తి సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జంట మరణాలపై అవగాహన ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులతో దర్యాప్తు చేయించి దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పోరాడుతున్న ప్రజాసంఘాల స్ఫూర్తి అభినందనీయమన్నారు. సభలో నాయకులు దేగాం యాదాగౌడ్, ప్రభాకర్, దేవారాం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికే ఆదర్శం జిల్లా క్రీడారంగం



క్రీడాకారులతో అధికారులు



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న నాయకులు

రెంజల్: క్రీడారంగంలో రాష్ట్రంలోనే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఆదర్శంగా నిలుస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కనుమరుగవుతున్న గ్రామీణ క్రీడలను దాతలు ప్రోత్సహించడం అభినందనీయమని కొనియాడారు. రెంజల్ హైస్కూల్‌లో ఆదివారం గడ్డం జనార్దన్‌రెడ్డి మెమోరియల్ టోర్నమెంట్, జిల్లా జట్లకు క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక ఎంపీపీ లోలపు రజని, సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు శంకర్, ఎస్సై ఉదయ్‌కుమార్, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్యాం మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు ప్రభుత్వ కొలువులను సాధించవచ్చని అన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడలపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం క్రీడాకారులకు గడ్డం జనార్దన్‌రెడ్డి కుటుంబీకులు స్రవంతి, సాత్విక్ క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆంజనేయులు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సోమలింగంగౌడ్, పీఈటీ కృష్ణ మూర్తి, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



నివాళి అర్పిస్తున్న అధికారులు, సిబ్బంది



గాలిలోకి తుపాకులు పేల్చుతున్న సిబ్బంది

మాక్లూర్: రైలు ప్రమాదంలో మృతి చెందిన ఎయిర్స్ ఫోర్స్ ఉద్యోగి రవిచంద్ర అంత్యక్రియలు మండలంలోని చిక్లి గ్రామంలో ఆదివారం జరిగాయి. ఎయిర్స్ ఫోర్స్ అధికారి చౌహాన్ రవిచంద్ర భౌతిక ఖాయంపై జాతీయ జెండా కప్పి సెల్యూట్ చేశారు. శ్మశాన వాటికలో గౌరవ వందనంగా సిబ్బంది గాలిలోకి మూడుసార్లు తుపాకులు పేల్చి నివాళి అర్పించారు. సర్పంచులు ప్రమీల, సంజీవ్ రావు, వేములపల్లి సుబ్బారావు, గ్రామస్తులు ఉన్నారు.

నగరంలో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



నగరంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద పటాకులు కాలుస్తున్న పార్టీ నేతలు



స్వీట్లు తినిపించుకుంటున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

ఖలీల్‌వాడి/నిజామాబాద్‌అర్బన్: నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. పార్టీ నాయకుడు షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారుగా నియమించడంతో వారు పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ మాట్లాడుతూ.. షబ్బీర్‌అలీని ప్రభుత్వ ఎ స్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల ప్రభుత్వ సలహాదారుగా నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. షబ్బీర్‌అలీ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆశిస్తున్నామన్నారు. నాయకులు అబూద్ హందాన్, కేశ మహేష్, సంతోష్, ప్రీతం, శుభం, అబ్దు అన్సారీ, కేశవరాజు, రఘు, లవంగం ప్రమోద్, నరేందర్ గౌడ్, సయాసలీం, ధర్మారం నవీన్, తిరుపతి, ప్రమోద్, జియా, ముజాహిద్‌ఖాన్, మాజిద్‌ఖాన్, ముజాహిద్ ఖాన్, సాబీర్, నూర్, షాదాబ్, జావిద్, శివ, నిఖిల్ రెడ్డి, సందీప్ రెడ్డి, బాబులు, వంశీ, అభిలాష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సదాశివనగర్: మండలంలోని కుప్రియాల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రాజు ఆదివారం తెలిపారు. మాక్లూర్ మండలం చిక్లి గ్రామానికి చెందిన కుంచపు శేఖర్(28) ఈ నెల 11న జాతీయ రహదారిపై రోడ్డు క్రాస్ చేస్తుండగా కంటైనర్ ఢీకొన్నది. ఈ ఘటనలో తలకు, కాళ్లకు తీవ్రగాయాలు కావడంతో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరి అదృశ్యం



నిజామాబాద్ రూరల్: నీలకంఠనగర్ ప్రాంతానికి చెందిన చిలుక అబ్బయ్య అదృశ్యమైనట్లు రూరల్ ఇన్‌చార్జి ఎస్సై రామారావు ఆదివారం తెలిపారు. శనివారం ఉదయం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని సాయిబాబా గుడికి వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లిన అబ్బయ్య తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు శైలేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లింగాపూర్‌లో చోరీ

రుద్రూర్: కోటగిరి మండలం లింగాపూర్‌లో తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై సందీప్ ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బయ్యగారి నవీన్ తన ఇంటికి తాళం వేసి వేరే ఊరికి వెళ్లాడు. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. మూడు మాసాల బంగారం, ఎనిమిది తులాల వెండి చోరీకి పాల్పడినట్లు బాధితుడు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మాక్లూర్: మండలంలోని కొత్తపల్లి శివారులో పేకాటస్థావరంపై దాడిచేసినట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ ఆదివారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో వారి నుంచి రూ. 10,520 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా పేకాట ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. దాడిలో టాస్క్ ఫోర్స్ సీఐ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన నెమలికి వైద్యం



ఎల్లారెడ్డిరూరల్: అనారోగ్యానికి గురై ఎగరలేని స్థితిలో ఉన్న నెమలికి వైద్యం అందించినట్లు అటవీశాఖ రేంజ్ అధికారి ఓంకార్ ఆదివారం తెలిపారు. మండలంలోని శివానగర్ ప్రాంతంలో నెమలి ఎగరలేని స్థితిలో ఉన్నట్లు గుర్తించిన స్థానికులు సమాచారం అందించడంతో బీట్ ఆఫీసర్ సవిత బేస్ క్యాంపు సిబ్బందితో కలిసి నెమలిని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. వెటర్నరీ వైద్యురాలు అర్చన గాయపడిన నెమలికి వైద్యం చేశారు. నెమలికి రెండు రోజుల వైద్యం అవసరమని ఆ తర్వాత అడవిలో వదిలిపెడతామని ఆయన పేర్కొన్నారు.

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో కామారెడ్డి జిల్లా ఉపాధ్యాయుడు



ప్రదర్శనలో పాల్గొన్న యువ శాస్త్రవేత్తలతో చర్చిస్తున్న విజయగిరి రామకృష్ణ

కామారెడ్డి రూరల్: ఇండియా సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హర్యానాలో జనవరి 17 నుంచి 20 వరకు ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ జరిగింది. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న పలువురు నిష్ణాతులై, విషయ పరిజ్ఞానం కలిగిన ఉపాధ్యాయులను పలుసార్లు పరీక్షించి ఆహ్వానం పంపింది. ఇందులో కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న విజయగిరి రామకృష్ణ ఎంపికై పాల్గొన్నారు. ప్రయోగాత్మక అభ్యసనాన్ని ప్రోత్సహించడానికి ఈ ఫెస్టివల్ ఉపయోగపడుతుందని రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ విభాగంలో ప్రపంచంలోని 33 దేశాలకు చెందిన విద్యావేత్తలు పాల్గొన్నారు. రామకృష్ణను పలువురు అభినందించారు.